'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

బీజేపీకే 'మహా' పీఠం

మహారాష్ట్ర ఎన్నికల్లో భారీ విజయం సాధించిన మహాయుతి కూటమి సీఎం అభ్యర్థిని ఖరారు చేసేందుకు చాలా రోజులే తీసుకున్నది. ఎట్టకేలకు ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ గద్దెనెక్కారు. చివరి నిమిషం దాకా సీఎం పదవి కోసం పట్టుబట్టిన ఏక్‌నాథ్ షిండే తన బెట్టు వీడి ఓ మెట్టు దిగి ఉప ముఖ్యమంత్రి పదవి తీసుకునేందుకు సిద్ధపడ్డారు. రెండో ఉప ముఖ్యమంత్రి పదవిలో అజిత్ పవార్ యథావిధిగా ఒదిగిపోయారు. కూటమిలో అత్యధిక స్థానాలకు పోటీ చేసి సొంతంగా మెజారిటీ సాధించాలనుకొని రంగంలోకి దిగిన బీజేపీ మ్యాజిక్ ఫిగర్‌కు కొద్ది దూరంలోనే ఆగిపోయింది. కేంద్రంలో మోదీ సర్కార్ లాగే ఇక్కడా బీజేపీకి మిత్రుల అవసరం తప్పనిసరైంది. అందుకే అత్యున్నత పదవిపై అంతగా మల్లగుల్లాలు పడాల్సి వచ్చింది. ఏదేమైనప్పటికీ కూటమి పక్షాల మెడలు వంచి ఫడ్నవీస్‌కు పట్టం కట్టించి తన పంతం నెగ్గించుకున్నది. దీంతో మహారాష్ట్ర మరోసారి పూర్తిగా బీజేపీ వశమైపోయిందని భావించవచ్చు.

బీజేపీ అధినాయకత్వం తరపున సీఎం ఎంపిక తతంగంలో పాల్గొన్న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 'డబుల్ ఇంజిన్ సర్కారు' ఏర్పడినట్టు వ్యాఖ్యానించడమే అందుకు ఓ సూచనగా భావించాలి. ఫలితాలు వెలువడిన తర్వాత పక్షం రోజుల పాటు సుదీర్ఘంగా సాగిన బేరసారాల ఫలితంగా ఏక్‌నాథ్ షిండే తన సీఎం అవతారాన్ని చాలించాల్సి వచ్చింది. శివసేనను చీల్చి బీజేపీని అధికారానికి చేరువగా తెచ్చినందుకు, రెండున్నరేండ్లు అధికారంలో కొనసాగడమే కాకుండా మరోసారి కూటమిని గెలుపుబాట పట్టించినందుకు తనకే మరోసారి సీఎం పదవి ఇవ్వాలనే వాదనపై బీజేపీని ఆయన ఒప్పించలేకపోయారు. అయితే, చివరి నిమిషం దాకా ఉత్కంఠ మాత్రం కలిగించారు. బీజేపీ నాయకత్వం ఆయనకు ఏయే హామీలిచ్చి దారికి తెచ్చుకుందో తెలియదు. రెండో స్థానంలో సర్దుకునేందుకు షిండే అంగీకరించక తప్పలేదు. దీనిని కేవలం ఒకటో స్థానం నుంచి రెండో స్థానంలోకి మారడంగా మాత్రమే చూడలేం.

తాజా పరిణామాలను నిశితంగా గమనిస్తే షిండే రాజకీయ భవితవ్యం డోలాయమానంలో పడినట్టేనని చెప్పవచ్చు. ఆయన మరోసారి సీఎం అయ్యే అవకాశాలు ఇక లేనట్టేనని భావించాలి. పైగా షిండే వర్గం సంఖ్యాబలం కూడా బీజేపీని లొంగదీసుకునే స్థాయిలో లేకపోవడం గమనార్హం. ఒకవేళ షిండే వర్గం మద్దతు లేకపోయినా అజిత్ పవార్ వర్గం అండతో సర్కారు ఏర్పాటుచేసే అవకాశం బీజేపీకి ఉండనే ఉన్నది. నిన్న షిండే శివసేనను చీల్చినట్టుగానే రేపు బీజేపీ షిండే వర్గాన్నీ చీల్చి తన అధికారాన్ని పదిలం చేసుకున్నా ఎవరూ చేయగలిగింది ఏమీ లేదు. ఎందుకంటే సొంత ఎజెండాను అమలు చేసేందుకు పూర్తి అధికారం తనకే ఉండాలని ఆ పార్టీ కోరుకుంటుందనేది జగమెరిగిన సత్యం. దేశంలో అప్రతిహత ఆధిపత్యాన్ని కోరుకునే బీజేపీ షిండే వంటి ప్రాంతీయ పార్టీల నేతలను వాడుకొని ఆపై వదిలించుకుంటుంది. ఇది జగమెరిగిన సత్యం. ధాత్రే కుటుంబానికి నమ్మకద్రోహం చేసిన షిండేను బీజేపీ ఎన్నటికీ విశ్వసించదు గాక విశ్వసించదు. పైకి కాంగ్రెస్ ముక్త్ భారత్ అంటుండవచ్చు. కానీ, అంతిమంగా ప్రాంతీయ పార్టీలను లేకుండా చేయడం ఆ పార్టీ లక్ష్యమనేది గుర్తుంచుకోవాలి. మహారాష్ట్ర పరిణామాలు బీహార్ సీఎం నితీశ్ కుమార్ వంటివారికి కనువిప్పు కావాలి.

ప్రతీకార పాలనలో ప్రజలే సమిధలు

గోసుల శ్రీనివాస్ యాదవ్

పాలకుడికి తన ప్రాంతం పట్ల ప్రేమ ఉండాలి. పాలనలో దీక్షాదక్షత ఉండాలి. రాష్ట్ర ప్రగతి, ప్రజల సంక్షేమంపై ధ్యాస ఉండాలి. అంతేకానీ, ఎప్పుడూ ప్రతీకారంతో రగిలిపోతే దాని ప్రభావం పాలనపై పడుతుంది. ప్రతిపక్షాల పట్ల ప్రతీకారంతో వ్యవహరించడం వల్ల అంతిమంగా పాలన గాడి తప్పి ప్రజలే సమిధలు కావాల్సి వస్తుంది. రాష్ట్ర ప్రగతిని, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి రాజకీయ కక్ష సాధింపే ప్రధాన లక్ష్యంగా పాలన సాగిస్తే రామరాజ్యం కాస్త రావణకాష్ఠంలా మారుతుంది. రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ సాగిస్తున్న విధ్వంసక పాలనే అందుకు తార్కాణం.

రాజకీయ ప్రత్యర్థులపై ప్రతీకారంతో పాలనను పక్కకుపెట్టి విధ్వంసం సృష్టించే ప్రభుత్వాలు ఎక్కువ కాలం మనుగడ సాగించవు. ప్రపంచ చరిత్రను ఒకసారి పరికించి చూస్తే విధ్వంసం దిశగా వెళ్లి పతనమైన అనేక ప్రభుత్వాలు మనకు కనిపిస్తాయి. గాలివాటంగా అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్.. ప్రతిపక్షాలపై కసి తీర్చుకోవడమే లక్ష్యంగా అడుగులేస్తున్నది. మసిబూసి మారేడుకాయ చేసి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ఎప్పుడో పాలనను గాలికి వదిలేశారు. ఫలితంగా రాష్ట్రంలో ఒక్క ఏడాదిలోనే 347 మంది రైతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారు. 119 మంది నేత కార్మికులు తనువు చాలించారు. సుమారు 100 మంది నిరుద్యోగులు అసువులు బాశారు. 49 మంది విద్యార్థులు మరణించారు. అంతేకాదు, 217 మంది అమాయకులు కరెంటు షాక్ కారణంగా చనిపోయారు. తెలంగాణలో చావు వార్త లేకుండా తెల్లారిన రోజు లేదని చెప్పడం అతిశయోక్తి కాదు.

> **కాంగ్రెస్ సర్కార్ ప్రజాపాలన వారోత్సవాలను నిర్వహిస్తుండటం విడ్డూరం. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను కొనసాగించడం ఆనవాయితీ. అంతేకాదు, ఎన్నికలకు ముందు ప్రకటించిన వాగ్దానాలను అమలు చేయడం వారి బాధ్యత. కానీ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తులను చెరపేయడమే లక్ష్యంగా, గత పాలకులపై కేసులు బనాయించి, వారిని జైల్లో వేయడమే తమ కర్తవ్యమన్నట్టుగా కాంగ్రెస్ పాలన సాగుతున్నది. కాంగ్రెస్ పాలకుల తీరు అచ్చం వికృత రాజకీయాన్ని తలపిస్తున్నది.**

39 స్థానాలను కట్టబెట్టి, ప్రధాన ప్రతిపక్షంగా అవకాశమిచ్చిన ప్రజల పక్షాన పోరాడటం, ప్రజల హక్కులను కాపాడటం ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ బాధ్యత. గతంలో ఇదే కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా లేకపోయినా ఆ పార్టీని గౌరవించి ప్రజల నుంచి వస్తున్న విజ్ఞాపనలను గత కేసీఆర్ సర్కార్ స్వీకరించింది. కానీ, నేడు ప్రశ్నిస్తే కేసులు, హామీలపై నిలదీస్తే అరెస్టులు, పాలనలో లోపాలను గుర్తు చేస్తే జైళ్లల్లో వేయడం వంటి చర్యలతో రేవంత్ సర్కార్ పాలన ఒక ప్రహసనంలా మారింది. గురుకులాల్లో విద్యార్థుల అవస్థలను పరిశీలిస్తున్న బృందాలపై కేసులు బనాయిస్తున్నారంటేనే ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై ప్రభుత్వానికి ఎంతటి ప్రతీకారేచ్ఛ ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు, ప్రభుత్వం లాక్కుంటున్న భూములపై నిలదీసినందుకు లగచర్లల్లో ప్రతిపక్ష నేతలపై కేసులు పెట్టారు. హైడ్రా, మూసీ పేరిట నగరంలో పేదల ఇండ్లను కూలుస్తున్న ప్రభుత్వానికి అడ్డొచ్చినవారిని కటకటాల పాలుచేస్తున్నారు. అయితే పార్టీలపై, నేతలపై ప్రతీకారం, కసి, కోపం ఉంటే ఉండొచ్చు గాక.. కానీ, ప్రజలను సైతం కేసుల పాలుచేయడం చరిత్రలో ఏ సర్కారు చేయలేదు. ప్రజాపాలనలో వేలాది మంది అమాయక ప్రజలు జైళ్లల్లో మగ్గుతున్నారు.

లగచర్ల రైతులు జైలు పాలుకాగా, నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ప్రజలపై కేసులు పెట్టారు. తాము గతంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు అడిగినందుకు గ్రామ ప్రథమ పౌరులైన సర్పంచులపై కూడా కేసులు బనాయించారు. ఉద్యోగాలు కల్పించాలని నిలదీస్తే విద్యార్థులపై లాఠీలు ఝుళిపించారు. ఏడాదిలోనే ఇందిరమ్మ రాజ్యం (ఎమర్జెన్సీ రాజ్యం) దిశగా కాంగ్రెస్ సర్కార్ అడుగులు వేస్తున్నది. కేసీఆర్ సర్కార్ పదేండ్ల పాటు పచ్చని పాలన అందించగా.. ఒక్క ఏడాదిలోనే నెత్తుటి పాలన అందిస్తున్న ప్రభుత్వంగా కాంగ్రెస్ అపకీర్తిని మూటగట్టుకున్నది.

సేవ్ డెమోక్రసీ అంటూ రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా తిరుగాడుతుంటే.. రాష్ట్రంలో రేవంత్ మాత్రం డెమోక్రసీ గొంతు నులుముతున్నారు. నేడు రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన నడుస్తున్నది. అరెస్టులు, నిర్బంధాలతో కూడిన నిరంకుశ పాలన కొనసాగుతున్నది. ఇదిలా ఉంటే, సంక్షేమ శాఖ మంత్రి లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడి 49 మంది తెలంగాణ బిడ్డలు చనిపోయారు. ఇప్పటివరకు రాష్ట్రానికి హోం మంత్రిని నియమించలేదు. గత అసెంబ్లీ సెషన్ సమయంలో నగరం నడిబొడ్డున ఓ ఆడబిడ్డపై లైంగికదాడి జరిగింది. విద్యార్థుల అక్రమ అరెస్టులు జరిగాయి. అంతేకాదు, ఎన్నడూ లేని విధంగా జంటనగరాల్లో రెండు నెలలుగా నిషేధాజ్ఞలు కొనసాగుతున్నాయి.

పచ్చని తెలంగాణ నేడు ఎన్‌కౌంటర్ల తెలంగాణగా మారిపోయింది. మొన్నటివరకు ఎన్‌కౌంటర్లు లేని తెలంగాణను చూసిన మనం ఇవాళ ఎప్పుడు, ఎక్కడ ఎన్‌కౌంటర్ జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నాం. కాంగ్రెస్ సర్కారు కొలువుదీరిన ఏడాదిలోనే మూడు ఎన్‌కౌంటర్లు, ఆరు కేసులు అన్నట్టుగా పరిస్థితి తయారైంది.

ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచీ ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టాలనే ఆలోచన తప్ప, మంచి ప్రజాస్వామిక పాలన అందించాలని ప్రభుత్వం ఎప్పుడూ ప్రయత్నించలేదు. అందులో భాగంగానే కాళేశ్వరం కమిషన్ అని, కరెంటు కమిషన్ అని కేసీఆర్‌పై, ఈ-రేస్ అని కేటీఆర్‌పై, నేడు ఫోన్ ట్యాపింగ్ అని హరీశ్‌రావుపై కేసులు పెట్టే ప్రయత్నం చేస్తున్నది. సహచర ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని కలవడానికి వెళ్తే అక్రమంగా అరెస్టు చేసి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో హరీశ్‌రావును నిర్బంధించడం మరీ దారుణం.

కేసీఆర్, ఆయన కుటుంబంపై ప్రతీకారంతో నియమించిన కాళేశ్వరం కమిషన్ విచారణ కక్ష సాధింపులో భాగంగానే సాగుతున్నది. కరెంటు కమిషన్ విచారణ కేసీఆర్ కేంద్రంగానే సాగి అభాసుపాలైంది. కేవలం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులను కేంద్రంగా చేసుకొని డైలీ సీరియల్‌లా సాగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు అతీగతీ లేదు. రాష్ట్రంలో ఏదో ఒక ప్రజా సమస్య ఉత్పన్నమైనప్పుడల్లా ఏదో ఒక కేసు, విచారణ పేరుతో గత ప్రభుత్వం తాలూకు ఆనవాళ్లను నెమరువేసుకుని దృష్టి మళ్లిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలపై విచారణ పేరిట కేసులు బనాయించడం, వారిని జైల్లో వేయాలనే లక్ష్యంగా సాగుతున్న ఈ పాలన తాత్కాలికమే అన్న విషయాన్ని పాలకులు గుర్తుంచుకోవాలి.

బుద్ధిజీవులు, మేధావులు మౌనం వీడాల్సిన సమయం ఆసన్నమైంది. నిర్బంధాన్ని, రాజ్య హింసను ఎదుర్కోవడం తెలంగాణ సమాజానికి కొత్త కాదు. నిర్బంధాల నుంచే స్వరాష్ట్రంగా తెలంగాణ ఉదయించింది. అలాగే కాంగ్రెస్ సర్కార్ నేడు చేస్తున్న నిర్బంధకాండ నుంచే బీఆర్ఎస్ సర్కార్ మళ్లీ జీవం పోసుకోవడం ఖాయం.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు)

నోరు జారితే కటకటాలే!

మబ్బు నుంచి జారిపడిన చినుకు మళ్లీ వెనకకు తిరిగి వెళ్లాలనుకున్నా వెళ్లలేదు. అదేవిధంగా నోరు జారిన మాటను, పేలిన తూటాను వెనక్కి తీసుకోలేం. కాబట్టి, ప్రతి వ్యక్తికి తన నాలుక మీద నియంత్రణ అవసరమన్న సందేశమిచ్చారు శ్రీ కోటిలింగేశ్వర శతకకారుడు.

ఎవరైనా నోటి మీద అదుపు కోల్పోయి, వేరేవారిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే అందుకు పర్యవసానాలను ఎదుర్కోక తప్పదు. సదరు అనుచిత వ్యాఖ్యలు ఎదుటివారి పరువుకి భంగం కలిగిస్తే పరువు నష్టం దావాను కూడా ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అయితే, ఈ మధ్య ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చాలామంది రాజకీయ నాయకులు భావావేశంలో నియంత్రణ కోల్పోయి లేదా దురుద్దేశంతో హద్దులు మీరి మాట్లాడుతూ చిక్కులను కొనితెచ్చుకుంటున్నారు.

ఈ సమాజంలో ప్రతి వ్యక్తికి, సంస్థకు, సొసైటీకి, లేదా ఒక వస్తుత్వానికి లభించే గౌరవాన్ని ఆ వ్యక్తి లేదా ఆ వస్తుత్వ పరువుగా పేర్కొంటారు. స్థిర చరాస్తుల వలె ఇది కూడా అమూల్యమైన సంపదే. ఆ సంపదకు ఎవరైనా తమ చర్యల ద్వారా ఉద్దేశపూర్వకంగా హాని కలిగిస్తే ఆ చర్యలు చట్టం కల్పించిన పది మినహాయింపుల పరిధిలో లేని పక్షంలో దాన్ని పరువు నష్టంగా భావించవచ్చు. నష్టపోయిన వ్యక్తి సివిల్, క్రిమినల్ న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. సివిల్ కోర్టులో బాధితుడికి నష్టపరిహారం లభిస్తే, క్రిమినల్ కోర్టులో నేరస్థుడికి శిక్ష పడుతుంది. ఇక క్రిమినల్ కేసు విషయానికొస్తే, భారతీయ న్యాయ సంహిత- 2023లోని సెక్షన్ 356 పరువు నష్టం, అందుకు విధించే శిక్షల గురించి వివరిస్తుంది.

> **సెక్షన్ 356: (1) ప్రకారం.. ఎవరైనా సరే మరొక వ్యక్తికి హాని కలిగించాలనే ఉద్దేశంతో లేదా తన చర్య మరొక వ్యక్తి పరువుకి హాని కలిగిస్తుందని తెలిసి లేదా ఏ కారణం వల్ల అయినా నమ్మి తన మాటలు, రాతలు, సంజ్ఞలు, వ్యక్తీకరణ ద్వారా గాని, ఏ విధమైన ఆరోపణలు చేసినా, ప్రచురణలు చేసినా ఆ ఆరోపణలు ఈ కింది మినహాయింపులకు లోబడనప్పుడు ఎదుటి వ్యక్తి (ఆరోపణలు చేయబడిన వ్యక్తి) పరువుకు నష్టం కలిగించినట్టుగా పరిగణించాలి.**

అయితే, ఈ సెక్షన్‌లో పేర్కొన్న పది మినహాయింపులకు లోబడినప్పుడు అది పరువు నష్టం కిందకు రాదు. ఆ మినహాయింపులు ఇవి:

- ప్రజా ప్రయోజనాల నిమిత్తం ఆరోపణలు చేయడం, ఏదైనా ప్రచురించడం తప్పనిసరైనప్పుడు ఆ చర్యలు పరువు నష్టం కిందికి రావు.
- ఒక ప్రజా సేవకుడు ప్రజా సంబంధిత కార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంలో సదుద్దేశంతో ఆయన నడవడికను గౌరవిస్తూ, లేదా ఆయన నడవడికలోని క్యారెక్టర్‌ను గౌరవిస్తూ ఏదైనా అభిప్రాయం తెలియజేయడం పరువు నష్టం కాదు.
- ఏ వ్యక్తి అయినా ఒక ప్రజా సంబంధిత ప్రశ్నను స్పర్శించినప్పుడు, సదుద్దేశంతో ఆ వ్యక్తి నడవడికను గౌరవిస్తూ, ఆయన క్యారెక్టర్‌ను గౌరవిస్తూ ఏదైనా అభిప్రాయం తెలియజేయడం పరువు నష్టం కాదు.
- ఒక కోర్టు ప్రొసీడింగ్స్, లేదా ఏవైనా అటువంటి ప్రొసీడింగ్స్‌ల ఫలితాన్ని వాస్తవానికి అతిదగ్గరగా ఉండేలా ప్రచురించడం పరువు నష్టం కాదు.
  వివరణ: ఒక కోర్టులోని ట్రయల్‌కు ముందు ఓపెన్ కోర్టులో ఒక మెజిస్ట్రేట్ లేదా మరొక అధికారి విచారణ జరుపుతున్నప్పుడు పై సెక్షన్‌కు సంబంధించి (దీనిని) కోర్టుగా పరిగణించాలి.
- ఒక కోర్టు డిసైడ్ చేసిన సివిల్ లేదా, క్రిమినల్ కేస్ మెరిట్స్‌ను గౌరవిస్తూ, ఆ కేసులోని పార్టీగా ఉన్న వ్యక్తి, సాక్షి, ఏజెంట్ గురించి, వారి కాండక్ట్‌ను, క్యారెక్టర్‌ను గౌరవిస్తూ సహృదయంతో వెలిబుచ్చే ఏ అభిప్రాయం పరువు నష్టం కాదు.
- ఏ కర్త అయినా తన పెర్ఫార్మెన్స్‌ను ప్రజల తీర్పు కోసం సమర్పించినప్పుడు ఆ పర్ఫార్మెన్స్ మెరిట్స్‌ను, ఆయన క్యారెక్టర్‌ను గౌరవిస్తూ సహృదయంతో వెలిబుచ్చే ఏ అభిప్రాయం పరువు నష్టం కాదు.
- ఒక వ్యక్తికి మరొక వ్యక్తిపై చట్టబద్ధమైన అధికారం లభించినప్పుడు, లేదా ఏదైనా చట్టబద్ధమైన ఒప్పందం ద్వారా అధికారం లభించినప్పుడు చట్టబద్ధమైన అధికార పరిధిలోని అంశాలకు సంబంధించి లేదా ఆ వ్యక్తి నడవడిక విషయంలో సహృదయంతో చేసే అభిశంసన పరువు నష్టం కిందికి రాదు.
- ఒక వ్యక్తిపై ఒక అంశంలో చట్ట రీత్యా అధికారమున్న ఎవరికైనా, ఆ అంశానికి సంబంధించి సదుద్దేశంతో ఆ వ్యక్తిపై నిందారోపణ చేయడం పరువు నష్టం కాదు.
  ఉదాహరణ: ఏ అనే వ్యక్తి సదుద్దేశంతో జెడ్ అనే పిల్లవాడి నడవడిక గురించి అతని తండ్రికి ఫిర్యాదు చేయడం పరువు నష్టం కిందికి రాదు.
- ఆరోపణలు చేసే వ్యక్తి స్వప్రయోజనాల రక్షణ కోసం లేదా మరొక వ్యక్తి ప్రయోజనాల రక్షణ కోసం లేదా ప్రజా ప్రయోజనాల రక్షణ కోసం మరొకరి క్యారెక్టర్‌పై సహృదయంతో చేసే ఆరోపణలు పరువు నష్టం కిందికి రావు.
- ఎదుటి వ్యక్తి ప్రయోజనం కోసం లేదా అతనికి సంబంధించిన మరొక వ్యక్తి ప్రయోజనం కోసం లేదా ప్రజాప్రయోజనం కోసం వేరొక వ్యక్తి గురించి సదుద్దేశంతో ఎదుటి వ్యక్తిని హెచ్చరించడం పరువు నష్టం కాదు.

సెక్షన్ 356 (2): ఎవరైనా మరొకరి పరువుకి భంగం కలిగించినప్పుడు రెండు సంవత్సరాల వరకు సాధారణ ఖైదు లేదా జరిమానా లేదా రెండు, లేదా సామాజిక సేవను శిక్షగా విధిస్తారు.

సెక్షన్ 356 (3): తాము అచ్చు వేస్తున్న లేదా చెక్కుతున్న ఏదైనా అంశం మరొక వ్యక్తి పరువుకి భంగం కలిగిస్తుందని తెలిసి లేదా సహేతుక కారణాల వల్ల నమ్మి ఆ విషయాన్ని అచ్చువేసినా లేదా చెక్కినా రెండేండ్ల సాధారణ ఖైదు లేదా జరిమానా లేదా రెండు శిక్షలు విధిస్తారు.

సెక్షన్ 356 (4): పరువునష్టం కలిగించే అంశాన్ని ఎవరైనా అచ్చువేసిన లేదా చెక్కిన ఏదేని ఒక వస్తువును అమ్మినప్పుడు లేదా అమ్మకానికి పెట్టినప్పుడు రెండేండ్ల వరకు సాధారణ ఖైదు లేదా జరిమానా లేదా రెండు శిక్షలు విధిస్తారు. అయితే, పరువు నష్టం సెక్షన్ 356 కింద నమోదయ్యే కేసులు బెయిల్ ఇవ్వదగినవి. అంతేకాదు, ఈ కేసులు రాజీకి అవకాశమున్నవి కావడం గమనార్హం.

బసవరాజు నరేందర్‌రావు
99085 16549

వైటీపీఎస్‌పై మరకలు నిలిచేవేనా..?

తుల్జారాంసింగ్ ఠాకూర్
78930 05313

ఒలింపిక్స్‌లో నిర్వహించే 100 మీటర్ల పరుగు పందెంతో పాటు 4X100 రిలే పరుగు పందెం పోటీలను సైతం ప్రపంచవ్యాప్త క్రీడాభిమానులు ఆసక్తిగా తిలకిస్తారు. 4X100 రిలేలో స్టార్టింగ్ లైను నుంచి పరుగు మొదలుపెట్టిన క్రీడాకారుడు తన వంతు 100 మీటర్ల పరుగు పూర్తికాగానే బ్యాటన్‌ను తదనంతర క్రీడాకారుడికి అందిస్తాడు. ఆ బ్యాటన్ అందుకున్న క్రీడాకారుడు వాయువేగంతో ఫినిషింగ్ లైన్ దిశగా ముందుకు పెరుగెత్తాలి. కానీ, 2023 డిసెంబర్‌లో తెలంగాణ రాష్ట్ర అధికార బ్యాటన్‌ను అందుకున్న ప్రస్తుత ముఖ్యమంత్రి తిరోగమన దిశలో పరుగెత్తడాన్ని రాష్ట్ర ప్రజానీకం గమనిస్తున్నారు. ఈ ధోరణి రాష్ట్ర విశాల ప్రయోజనాల దృష్ట్యా ఏ మాత్రం శ్రేయస్కరం కాదు.

ప్రభుత్వాలు, పార్టీల ఇష్టాయిష్టాలను రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా నిరంతరం పురోగమన దిశలో పయనించాల్సిన వ్యవస్థలకు ఈ స్పృహ కొరవడిన పక్షంలో ప్రజలు పరాజితులుగా మిగిలిపోతారు. రాబోయే విద్యుత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వాధినేత కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) ప్రాజెక్టు రాష్ట్ర పురోగతిలో అత్యంత కీలకమైనది. తెలంగాణ విద్యుత్తు ఉత్పత్తి రంగంలో స్వయం సమృద్ధిని సాధించడానికి తీసుకొచ్చిన ఈ ప్రాజెక్టు మీద కొంతకాలంగా కమ్ముకున్న నీలినీడలు తొలగిపోయి ఈ నెలలో జాతికి అంకితం కానుండటం శుభపరిణామం. దాన్ని ప్రారంభించకుండా తప్పించుకోవడం కాంగ్రెస్ సర్కార్‌కు సాధ్యం కాలేదు.

విద్యుత్తు రంగంలో గత ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయాల పట్ల ప్రస్తుత పాలకుల ఆరోపణలు తీవ్రస్థాయికి చేరుకోవడమే కాకుండా ప్రజల్లో గందరగోళ పరిస్థితులను కల్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాస్తవాలను తెలుసుకోవాల్సిన అవసరమున్నది. 2018 జనవరి 1 నుంచి తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల వినియోగదారులకు 24 గంటల కరెంటు అందుబాటులోకి రాగా, రైతులకు 24 గంటల ఉచిత కరెంటు అందింది. దేశవ్యాప్తంగా రైతులకు 24 గంటల ఉచిత కరెంటు అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నది.

ప్రస్తుతం నల్గొండ జిల్లా దామరచర్లలో నిర్మాణం పూర్తికావస్తున్న 4000 మెగావాట్ల మెగా సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ స్టేషన్ పూర్వాపరాలు, వాస్తవాలను చర్చించుకోవడం ఎంతైనా అవసరం. 2014 జూన్ 2న తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్ర విద్యుత్తు స్థాపిత సామర్థ్యం 7,778 మెగావాట్లు కాగా, అందులో థర్మల్ విద్యుత్తు వాటా 2,300 మెగావాట్లే. సాధారణంగా థర్మల్ విద్యుత్తును మనం బేస్ లోడ్‌గా చెప్పుకొంటాం. ఎందుకంటే నీటి లభ్యత ఉన్నప్పుడే జల విద్యుత్తు ఉత్పత్తికి అవకాశం ఉంటుంది. అలాగే సౌర విద్యుత్తు పగటి పూటే అందుబాటులోకి వస్తుంది. థర్మల్ విద్యుత్తును మాత్రమే నిరంతరాయంగా ఏడాది పొడవునా ఉత్పత్తి చేసుకోవడానికి వీలుంటుంది.

2014 జూన్ 2 నాటికి రాష్ట్రంలో అందుబాటులో ఉన్న థర్మల్ విద్యుత్తుకేంద్రాలు:

> **కొత్తగూడెం 5వ దశ**
> **2x250 మె.వా - 500 మె.వా**
> **కొత్తగూడెం 6వ దశ**
> **1x500 మె.వా - 500 మె.వా**
> **కాకతీయ మెదటి దశ**
> **1x500 మె.వా - 500 మె.వా**
> **కొత్తగూడెం ఏ, బీ, సీ స్టేషన్లు**
> **3x240 మె.వా - 720 మె.వా**
> **రామగుండం 'బీ' - 62.5 మె.వా**
> **మొత్తం సామర్థ్యం - 2,282.5 మె.వా**

పైన పేర్కొన్న వాటిలో 40 శాతం వరకు కాలం చెల్లిన ప్లాంట్లే. రామగుండం ప్లాంట్లను 2020లో స్క్రాప్ చేశారు. తెలంగాణ ఏర్పడినప్పుడు మన రాష్ట్ర విద్యుత్తు డిమాండ్ 9,000 మెగావాట్లు కాగా.. విభజన చట్టం ప్రకారం మనకు రావాల్సిన దిగువ సీలేరు 450 మెగావాట్ల ప్లాంట్లు ఆంధ్రాకు తరలిపోగా, నెల్లూరులోని దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ నుంచి మన వాటాగా రావాల్సిన 440 మెగావాట్లు అందకుండా ఆంధ్రా పాలకుడు చంద్రబాబు కుట్రతో విద్యుత్తు ఉత్పత్తి చేయకుండా నిలిపివేశారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్రంలో కోతలతో కరెంటు సరఫరా చేయడానికే 2,500 మెగావాట్లు లోటు ఉండగా, చంద్రబాబు మూలంగా 890 మెగావాట్ల మన విద్యుత్తు మనది కాకుండా పోయింది.

> **తెలంగాణ ప్రజలు, ప్రత్యేకించి రైతులు అలవిగాని కరెంటు కోతలతో అల్లాడిపోతున్న నేపథ్యంలో రాష్ట్ర జెన్‌కోను పరిపుష్టం చేసి విద్యుత్తు ఉత్పత్తి విషయంలో స్వయం సమృద్ధి సాధించే దిశగా వేసిన ముందడుగు వైటీపీఎస్.**

థర్మల్ పవర్ ప్లాంటును నెలకొల్పడానికి ప్రధానంగా కింద పేర్కొన్న విషయాలను పరిగణనలోకి తీసుకుంటారు.

- సాధ్యమైనంత మేరకు బీడు లేదా వ్యవసాయ యోగ్యం కాని భూములు.
- అవసరమైన నీరు. వీలైనంత వరకు ఏదైనా నదీ సమీప ప్రాంతం.
- ఇంధనం, బొగ్గు కేటాయింపు.
- రోడ్డు, రైలు రవాణా సౌకర్యం.
- పర్యావరణ, అటవీ అనుమతులు పొందడానికి అనువైన ప్రాంతం.
- విద్యుత్తును వాడుకునే డిమాండు కలిగిన ప్రాంతం.
- వ్యర్థాలను (ఫ్లెయాష్) తీసుకెళ్లడానికి సమీపంలో సిమెంట్ ఫ్యాక్టరీలు ఉండటం.

దామరచర్లను ఎంపిక చేయడానికి కారణాలు:

- వ్యవసాయ యోగ్యం కాని 4,676 ఎకరాల భూమి అందుబాటులో ఉండటం.
- కేవలం 5 కిలోమీటర్ల దూరంలో కృష్ణా నది నీరు అందుబాటులో ఉండటం.
- 300 కిలోమీటర్ల దూరంలో దేశీయ బొగ్గు లభ్యత ఉండటం, విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవడానికి అనువుగా కాకినాడ నౌకాశ్రయం సమీపంలో ఉండటం.
- 7 కిలోమీటర్ల సమీపంలో రాష్ట్ర హైవే నార్కట్‌పల్లి- అద్దంకి సెక్షన్ ఉండటం. 5 కిలోమీటర్ల అతి సమీపంలో విష్ణుపురం రైల్వేస్టేషన్ ఉండటం.
- కేంద్ర పర్యావరణ, అటవీ నోటిఫికేషన్లలో ఈ ప్రాంతం క్యాటగిరీ 'ఏ'లో ఉండటం వల్ల పర్యావరణ, అటవీ అనుమతులు పొందడ